## కేటీఆర్‌కు శుభాకాంక్షలు



నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును నగరంలోని ఆయన స్వగృహంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

– మహబూబ్ నగర్ అర్బన్, జనవరి 3:



## పుస్తక బహూకరణ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావును మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో వెళ్లి తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ సతీశ్ చందర్ రాసిన 'సీ ఫర్ క్యాస్ట్' అనే పుస్తకాన్ని కేటీఆర్‌కు అందజేశారు.

## శుభాకాంక్షలు..



నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ పాటి మీది జగన్మోహన్ రావు

– సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ);

# 420 హామీలపై దళితుల తిరుగుబాటు

**కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు, మంత్రులు దామోదర, ఉత్తమ్‌లపై మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు**

**న్యాయ సలహాల మేరకు కేసు నమోదు చేస్తాం: ఇన్‌స్పెక్టర్**

మలక్‌పేట, జనవరి 3: అధికార దాహంతో అమలుకు సాధ్యం కాని 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది గడుస్తున్నా వాటిని అమలు పర్చకపోవటంతో దళిత బిడ్డలు ఆగ్రహం చెందారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజ నర్సింహ, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించి ప్రచురితమైన దిన పత్రికల క్లిప్పింగులను కూడా వారు జతపరిచారు. 2023 ఆగస్టు 26న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారని, ఆ సభలో మల్లికార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహలు మాట్లాడుతూ.. ''రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. మాల కార్పొరేషన్, మాదిగ కార్పొరేషన్, ఉపకులాల కార్పొరేషన్లు వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని, ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతాం'' అని హామీ ఇచ్చారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల ప్రత్యేక పథకం, దళిత సమాజానికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తామని, పదో తరగతి పాసైన విద్యార్థులకు విద్యా జ్యోతి పథకం ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారని వారు పేర్కొన్నారు. మాదిగల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వటంతో వారి మాటలను నమ్మిన రాష్ట్రంలోని 70 లక్షల మంది దళితులు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించారని వారు ఫిర్యాదు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు సమర్పించామని, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా సీఎం రేవంత్ మాదిగలను మోసం చేశారని వారు అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీకి చైర్మన్‌గా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయినాయని, రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించాలని వినతి పత్రాలు సమర్పించినా సీఎం స్పందించలేదని, అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ చట్టాలను సైతం ఉల్లంఘించారని వారు పేర్కొన్నారు. అధికార దాహంతో హామీలు ఇచ్చి అమలు పరచని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు, మంత్రులు దామోదర రాజ నర్సింహ, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ (కేఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ, మాదిగ యువసేన గ్రేటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రకంటి సూరి మాదిగ, దర్శనం రామస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మారేపల్లి బాబూరావు మాదిగ, రాష్ట్ర మహిళా నాయకురాలు జంబూల అరుణ బైండ్ల లు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వారు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ న్యాయ సలహాల మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.



మోసపూరిత హామీలను గుప్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులపై మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ (కేఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ, మాదిగ యువసేన గ్రేటర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇంద్రకంటి సూరి మాదిగ, దర్శనం రామస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మారేపల్లి బాబూరావు మాదిగ, రాష్ట్ర మహిళా నాయకురాలు జంబూల అరుణ బైండ్లలు



మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలతో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. అధికారం ఖాయం

**మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి**

మణికొండ, జనవరి 3: ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలు పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వారిని కలిసి పలు అంశాలపై చర్చించారు. రాబోయే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న పంచాయతీ ఎన్నికలతో పాటు కౌన్సిల్, కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక నాయకులు సంసిద్ధులుగా ఉండాలని, అందు నిమిత్తం ప్రతి కార్యకర్తకు వెన్నుదన్నుగా ఎల్లవేళలా మేముంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పార్టీ తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో పాలు పంచుకొంటూ ప్రజా సౌకర్యార్థం ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో ధనరాజ్, రూపా రెడ్డి, రాజేంద్రప్రసాద్, అందె లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి, విజయలక్ష్మి, రామ సుబ్బారెడ్డి, ఆరీఫ్, మొహ్మద్, టోనీ, జై, శ్రీధర్, సుమ, రేఖ, కృపాకర్, రవి, అనూష, మంజు, అన్ను, గుట్ట మీది నరేందర్, విఠల్, మల్యాద్రి నాయుడు, కిరణ్ పాల్గొన్నారు.

## బీసీ భవన్‌ను ముట్టడించిన విద్యార్థులు

మెహిదీపట్నం జనవరి 3: ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని నాలుగు వేల మంది విద్యార్థులతో మాసబ్‌ట్యాంక్‌లోని బీసీ సంక్షేమ భవన్‌ను బీసీ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఫీజుల బకాయిలు, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేల స్కాలర్‌షిప్‌లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో విద్యార్థుల చదువులు గాలిలో దీపంలా మారాయని, విద్యార్థులు చదువులు ఆపేసి రోజు వారి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కోటి ఆశలతో పల్లెల నుంచి వచ్చిన విద్యార్థుల ఆశలు అడియాసలు అవుతున్నాయని, దీనిపై ప్రభుత్వం స్పందించాలని ఆర్.కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, గుజ్జ సత్యం, పగిళ్ల సతీశ్, అనంతయ్య, రవి కుమార్ యాదవ్, చంద్రశేఖర్, నిఖిల్, ప్రసాద్, వాణి, బాల స్వామి పాల్గొన్నారు.



## తెలుగు వారెక్కడున్నా.. మాతృ దేశాన్ని మరవొద్దు

**20 ఏండ్ల క్రితమే సైబరాబాద్‌కు పునాది**

**ప్రపంచ తెలుగు సమాఖ్యలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు**



కొండాపూర్, జనవరి 3: తెలుగు వారు ప్రపంచ వ్యాప్తంగా రాణిస్తున్నారని, వారెక్కడున్నా మాతృదేశాన్ని మరవకూడదని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దూర దృష్టి, నిర్దిష్ట లక్ష్యాలతోనే ఏదైనా సాధించవచ్చన్నారు. 25 ఏండ్ల క్రితం ప్రారంభించిన ఐటీ కేంద్రం ఇప్పుడు ప్రపంచానికే ఐటీ కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు డబ్బు ఎంత అవసరమో... అభివృద్ధి కోసం ఆలోచనలు అంతే అవసరం. ఐటీ అభివృద్ధి కోసం హైటెక్ సిటీని నిర్మించి, ఇంజనీరింగ్ కాలేజ్‌లను ఏర్పాటు చేసి ఉద్యోగాలను పెంచాము. దేశాన్ని ఆర్థిక రంగాల్లో దశ, దిశను మార్చిన వ్యక్తి పీవీ నరసింహారావని, ఆయనను ఆదర్శంగా తీసుకుని యువతను ఐటీ రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకురావాలని ఐటీ సెక్టార్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చాన్నారు. విదేశాల్లోని అవకాశాల కోసం ఒక కన్సల్టెన్సీని ఏర్పాటు చేసి అందరికీ అందించేలా చర్యలు తీసుకున్నాము. 20 ఏండ్ల క్రితం 2020 విజన్‌ను ఎలాగైతే ప్రారంభించి అభివృద్ధి చేశామో, ఇప్పుడు 2047ను సైతం అలాగే అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. ప్రపంచమంతా గ్లోబల్ విలేజ్‌గా మారింది. మీరెక్కడున్నా అక్కడి నుంచే మీ ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావాలన్నారు. ఒక చిన్న ఆలోచనతో ర్యాపిడ్, వర్క్ స్టేషన్లను ప్రారంభించి ఎంతో మందికి ఉద్యోగాలందిస్తున్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని, ఇప్పటికే అనేక టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయని, మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆయన అభిప్రాయపడ్డారు. బయో టెక్నాలజీలో వస్తున్న అభివృద్ధితోనే కొవిడ్ పాండమిక్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్‌ను అందించిన ఘనత మన తెలుగు వాడికే సొంతమైందన్నారు. ప్రపంచ దేశాల జనాభా విపరీతంగా తగ్గిపోతుందని, భారతదేశంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, భవిష్యత్తులో ప్రపంచానికి దిక్సూచిగా దేశం నిలుస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి టెక్నాలజీ తోడుంటే మరింత దిగుబడులు సాధ్యమవుతాయని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. తెలుగు వారికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తి నందమూరి తారక రామారావని ఆయన గుర్తు చేశారు. తెలుగు ఏంజిల్స్ ఆర్గనైజేషన్‌ను, తెలుగు ఫెడరేషన్ సావనీర్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో వరల్డ్ తెలుగు ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఇందిరా దత్, వైస్ ప్రెసిడెంట్ కవిత, జనరల్ సెక్రటరీ శ్రీలక్ష్మీ, భారత్ బయోటెక్ చైర్మన్ క్రిష్ణా ఎల్లా, చిత్తూరు సురేశ్, బీవీఆర్ మోహన్ రెడ్డి, దేశ విదేశాలలోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో మేడ్చల్‌ని అభివృద్ధి చేశా..

**ప్రతి గ్రామం, పట్టణాలను మరింత అభివృద్ధి చేస్తాం**

**మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**

**నాగారం మున్సిపాలిటీలో రూ.కోటి 56 లక్షలతో అభివృద్ధి పనులు షురూ..**



నాగారం మున్సిపాలిటీ 7వ వార్డు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 3: సొంత నిధులు కేటాయించి మేడ్చల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజవర్గంలో ఉన్న 61 గ్రామ పంచాయతీలను, 7 మున్సిపాలిటీలను, 3 మున్సిపల్ కార్పొరేషన్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. ప్రతి గ్రామానికి, పట్టణానికి నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. నియోజవర్గం హైదరాబాద్ నగరానికి పక్కన ఉండటంతో దినదినాభివృద్ధి చెందుతుందని, నిత్యం నూతనంగా ఇళ్లు నిర్మించడంతో కాలనీల సంఖ్య పెరుగుతుందని, అందుకు తగ్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. నాగారం మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందుందని, కోట్ల రూపాయిలతో రోడ్లు, డ్రైనేజ్, పార్కులు, వైకుంఠ ధామాలు నిర్మించారని అన్నారు.

### రూ.కోటి 56 లక్షలతో అభివృద్ధి పనులు

నాగారం మున్సిపాలిటీ 6వ వార్డు శిల్ప నగర్ కాలనీలో రూ.60 లక్షలు, 5, 6వ వార్డు లోటస్ కాలనీ రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, 6, 7వ వార్డు శిల్ప నగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను మల్లారెడ్డి ప్రారంభించారు.7వ వార్డు శిల్పా నగర్‌లో రూ.22 లక్షలతో పార్కు అభివృద్ధికి శంకుస్థాపన, 7వ వార్డు ప్రగతి ఎన్‌క్లేవ్ రూ.15 లక్షలు, సాయి నివాస్ కాలనీలో రూ.20 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్డు, డ్రైనేజ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కమిషనర్ భాస్కర్ రెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, డీఈ రఘు, కౌన్సిలర్లు అన్నంరాజు లావణ్య శ్రీనివాస్, కౌకుంట్ల అనంత్ రెడ్డి, గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్, కో-ఆప్షన్ సభ్యురాలు స్వప్న, నాయకులు ఆంజనేయులు గౌడ్ (అంజన్న), శ్రీనివాస్, సాయినాథ్ గౌడ్, అంజయ్య గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, దయకర్ రావు, కృష్ణారెడ్డి, నాగేందర్, సురేశ్, పెంటయ్య గౌడ్, జలీల్ పాషా పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలను స్వాగతించాలి: గవర్నర్



సిటీబ్యూరో, జనవరి 3(నమస్తే తెలంగాణ)/శేరి లింగంపల్లి: ప్రపంచంలో రోజు రోజుకు పెరిగిపోతున్న సాంకేతికతను యువత అందిపుచ్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మార్పులకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రపంచానికే సవాల్‌గా మారుతున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్సెస్, మిషన్ లెర్నింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకున్నప్పుడు యువత రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. డ్రీమ్ బిగ్ అచీవ్‌మెంట్ బిగ్ పద్ధతిలో నూతన ఆవిష్కరణలను యువత స్వాగతించాలన్నారు. యువతలో దాగి ఉన్న అపారమైన శక్తి వినియోగంలోకి వచ్చినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ రూపు రేఖలు మారుతాయన్నారు. అనంతరం వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

## పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు

**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ప్రారంభంలో మంత్రి పొన్నం**

సిటీబ్యూరో, జనవరి 3(నమస్తే తెలంగాణ): చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్ సహకారంతో ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చెప్పారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మాసోత్సవాలు ఈ నెల 31 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ ఏడాది వెయ్యి పాఠశాలల్లో ట్రాఫిక్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. జనవరి 7న జాతీయ రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో జాతీయ రవాణా సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను బ్రేక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మంత్రి చెప్పారు. ఇప్పటి వరకు 7000 మందిపై కేసులు నమోదయ్యాయని వివరించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం, ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో రవాణా శాఖ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, సి.రమేశ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు సమాన అవకాశాల బాధ్యత ప్రభుత్వాలదే

**సామాజిక కార్యకర్త, రచయిత్రి జూపాక సుభద్ర**




సదస్సులో మాట్లాడుతున్న రచయిత్రి జూపాక సుభద్ర

బంజారాహిల్స్,జనవరి 3: విద్య, రాజకీయ రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని సామాజిక కార్యకర్త, రచయిత్రి జూపాక సుభద్ర అన్నారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయుల వేడుకల్లో భాగంగా 'స్త్రీ అస్తిత్వవాద స్ఫూర్తి సావిత్రీబాయి పూలే' అనే అంశంపై జూపాక సుభద్ర ప్రసంగించారు. మహిళలకు విద్య ద్వారానే సాధికారిత లభిస్తుందని నమ్మిన సావిత్రీ బాయి పూలే స్ఫూర్తితో నేడు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నారన్నారు. రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్పా చక్రపాణి, డా. జి.మేరీ సునంద, ప్రొ. కే.రాణి, రజిత మాధురి పాల్గొన్నారు.

## ఎంహెచ్ కాగ్నిషన్‌తో ఎంఆర్‌యూ ఒప్పందం


మేడ్చల్, జనవరి 3: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వ విద్యాలయం దుబాయి సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఎంహెచ్ కాగ్నిషన్‌తో విశ్వ విద్యాలయం వేదికగా శుక్రవారం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా వ్యవస్థాక చైర్మన్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల కలలను సాకారం చేయడమే లక్ష్యంగా వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకొని, శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ సంస్థ చైర్మన్ అహ్మద్ సుబేర్ మాట్లాడుతూ, దుబాయి కేంద్రంగా పని చేస్తున్న తమ సంస్థ కృత్రిమ మేధ, మెషిన్ లర్నింగ్, ఆధునిక కంప్యూటింగ్ వంటి రంగాల్లో పని చేస్తుందని తెలిపారు. 130 మంది విద్యార్థులకు నైపుణ్య పరీక్షలు నిర్వహించి, 54 మంది విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేశామన్నారు. వారికి ఆరు నెలల పాటు గౌరవ వేతనంతో తర్ఫీదు ఇస్తామని తెలిపారు. అనంతరం, తమ కేంద్ర కార్యాలయంలో రూ.12 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, ఏఐఎంల్ హెచ్‌వోడీ డాక్టర్ తయ్యాబా ఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంహెచ్ కాగ్నిషన్ కంపెనీ చైర్మన్ అహ్మద్ సుబేర్‌తో ఒప్పంద చేసుకుంటున్న ఎంఆర్‌యూ చైర్మన్ మల్లారెడ్డి

## అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ..

**6న మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం ముట్టడి**



అభివాదం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

ఖైరతాబాద్, జనవరి 3: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ నెల 6న మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నగరంలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని జేఏసీ చైర్మన్ జె.చెన్నయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్ షా వ్యాఖ్యలు దేశంలోని 20 కోట్ల మంది దళితులను కించపరిచిందని, భారత రాజ్యాంగాన్ని అగౌరవపరిచారన్నారు. బీజేపీకి మద్దతు పలుకుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ కేంద్ర మంత్రి వైఖరిని ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగం వల్లే తాను సీఎం అయ్యానని ప్రచారం చేసుకునే ప్రధాని నరేంద్ర మోదీ దీనికి సమాధానం చెప్పాలన్నారు. 6న జరిగే బీజేపీ ముట్టడి కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి మాలలు, సంఘాలు, దళిత సంఘాలు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు రాజు వస్తాద్, మందాల భాస్కర్, బూర్గుల వెంకటేశ్, ఆవుల సుధీర్, గడ్డం శంకర్, గోపోజు రమేశ్, మాదాసు రాహుల్ పాల్గొన్నారు.